


జాతీయ తెలుగు దినపత్రిక
RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు




| బుధవారం 06 మే 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 338 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
|---|---|---|---|---|---|



## విశాఖ రైల్వే జోన్ గెజిట్, లేబర్ అడ్డాల అభివృద్ధి, గూగుల్ డేటా సెంటర్‌పై కీలక నిర్ణయాలు – ఏపీ అభివృద్ధి దిశగా ముందడుగు

సందేశం టైమ్స్, అమరావతి, మే 06, ప్రతినిధి: విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు చేస్తూ రైల్వే శాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం పట్ల హర్షం వ్యక్తమవుతోంది. ఏపీ ప్రజల చిరకాల స్వప్నం నెరవేరగా, 2026 జూన్ 1 నుంచి విశాఖ కేంద్రంగా జోన్ అధికారిక కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. వాల్తేరు డివిజన్ పునర్వ్యవస్థీకరణలో భాగంగా పలాస–ఇచ్ఛాపురం వంటి కీలక సెక్షన్లు విశాఖ డివిజన్‌లో విలీనం కావడం ఉత్తరాంధ్ర రవాణా రంగానికి కొత్త రూపాన్ని తీసుకురానుంది. విశాఖ, రాయగడ డివిజన్‌ల మధ్య సమన్వయంతో రైల్వే వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని భావిస్తున్నారు.అదే విధంగా కార్మికులు పని కోసం ఎదురుచూసే సమయంలో వర్షం, ఎండల నుంచి రక్షణ లేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఆధునిక వసతులతో లేబర్ అడ్డాల నిర్మాణం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.ఇక విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తామని, 2028 సెప్టెంబర్ 28 నాటికి ప్రారంభమయ్యేలా లక్ష్యంగా పనిచేస్తామని వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీని ఆహ్వానించనున్నట్లు కూడా తెలిపారు. వేగవంతమైన అభివృద్ధి కోసం స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని అమలు చేస్తూ రాష్ట్రాన్ని పెట్టుబడులకు అనుకూలంగా తీర్చిదిద్దుతున్నట్లు పేర్కొన్నారు.



## పాఠశాలల నుంచి వైద్య విద్య వరకు AI సిలబస్ ప్రవేశంపై ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు – రఘురామ్ రాజన్ సలహాలు కోరిన సీఎం రేవంత్ రెడ్డి

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 06, ప్రతినిధి: ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, సాంకేతిక విద్యతో పాటు వైద్య విద్య సిలబస్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) వినియోగం, దాని ప్రయోజనాలపై అధ్యయనం చేయడానికి ఉన్నతస్థాయి కమిటీని నియమిస్తామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ అంశంపై తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్‌ను సీఎం కోరారు.జూబ్లీహిల్స్ నివాసంలో సీఎం ఆధ్వర్యంలో జరిగిన తెలంగాణ భవిష్యత్ ప్రణాళిక సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రఘురామ్ రాజన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ AI వినియోగంతో పాటు మధ్యస్థాయి ఉద్యోగాల కల్పన కోసం స్కిల్స్ యూనివర్సిటీ, ఏటీసీలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. AI సరైన విధంగా వినియోగిస్తే అందరికీ మేలు జరుగుతుందని రఘురామ్ రాజన్ అభిప్రాయపడ్డారు. తమిళనాడు తరహాలో పారిశ్రామిక విధానం అమలు చేస్తే పెట్టుబడులు పెరుగుతాయని ఆయన సూచించారు. డేటా సెంటర్లకు పెద్దఎత్తున విద్యుత్, నీటి అవసరం ఉంటుందని పేర్కొన్నారు. మూడు నుంచి నాలుగు నెలల్లో హైదరాబాద్‌ను సందర్శిస్తానని తెలిపారు.నైపుణ్యాలు పెంపొందించుకుంటే ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని, పోషకాహార లోపాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందని రఘురామ్ రాజన్ సూచించారు. స్టార్టప్‌లకు ప్రోత్సాహం ఇస్తే ఆర్థిక వృద్ధి మరింత వేగవంతమవుతుందని తెలిపారు.ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాష్ట్రంలో పరిశ్రమలకు కావాల్సిన భూమి, మౌలిక సదుపాయాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. విద్యుత్ ఉత్పత్తి, అంతర్జాతీయ విమానాశ్రయం, ఔటర్ రింగ్ రోడ్ వంటి వసతులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని క్యూర్ (CURE), ప్యూర్ (PURE), రేర్ (RARE) విధానాల్లో అభివృద్ధి చేస్తున్నామని వివరించారు.మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఫార్మా, ఐటీ, డేటా సెంటర్లకు అనుకూల వాతావరణం తెలంగాణలో ఉందని తెలిపారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, స్పెషల్ చీఫ్ సెక్రటరీలు జయేష్ రంజన్, వాణీ ప్రసాద్ పాల్గొన్నారు.

## సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య 33 నుంచి 37కు పెంపునకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం




సందేశం టైమ్స్, న్యూ ఢిల్లీ, మే 06, ప్రతినిధి: సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను (భారత ప్రధాన న్యాయమూర్తిని మినహాయించి) ప్రస్తుతం ఉన్న 33 నుంచి 37కు పెంచేందుకు ప్రధానమంత్రి అధ్యక్షతన సమావేశమైన కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయం ద్వారా న్యాయ వ్యవస్థలో పెరుగుతున్న కేసుల భారాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు భావిస్తున్నారు.దీనికోసం 'సుప్రీంకోర్టు (న్యాయమూర్తుల సంఖ్య) సవరణ బిల్లు–2026'ను పార్లమెంటులో ప్రవేశపెట్టి, 1956 సుప్రీంకోర్టు (న్యాయమూర్తుల సంఖ్య) చట్టాన్ని సవరించనున్నారు. ఈ సవరణ ద్వారా అత్యున్నత న్యాయస్థానంలో కేసుల పరిష్కార ప్రక్రియ వేగవంతమవుతుందని కేంద్రం భావిస్తోంది.



## హైదరాబాద్‌లో BASF రెండు గ్లోబల్ కెపబిలిటీ సెంటర్ల ఏర్పాటు – 3,000 ఉద్యోగాల సృష్టి

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 06, ప్రతినిధి: రసాయనాల తయారీలో ప్రపంచంలో అగ్రగామి సంస్థలలో ఒకటైన BASF హైదరాబాద్‌లో రెండు గ్లోబల్ కెపబిలిటీ సెంటర్ల (GCCs) ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. గ్లోబల్ డిజిటల్ హబ్, గ్లోబల్ సర్వీసెస్ హబ్ పేర్లతో ఈ కేంద్రాలను ఏర్పాటు చేయనున్న సంస్థ రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించి అంగీకార పత్రం (LOI) సమర్పించింది.మంగళవారం ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జర్మన్ కాన్సుల్ జనరల్ మైఖేల్ హాస్పర్ సమక్షంలో BASF గ్లోబల్ బిజినెస్ సర్వీసెస్ అధ్యక్షుడు టోబియాస్ డ్రాట్, తెలంగాణ లైఫ్ సైన్సెస్ సీఈఓ సర్వేశ్ సింగ్‌కు లెటర్ ఆఫ్ ఇంటెంట్ అందజేశారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా సుమారు 3,000 మందికి కొత్త ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఏడాదికి 100 GCCలను ఆకర్షించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, వీటి ద్వారా లక్ష మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించవచ్చని తెలిపారు. హైదరాబాద్‌ను కేవలం కార్యాలయాల కేంద్రంగా కాకుండా ఆవిష్కరణలు, ఇంజినీరింగ్ రంగాల్లో ప్రపంచ స్థాయి నగరంగా అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. AI ఆధారిత ఐకామ్ కేంద్రం, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, 200 ఎకరాల్లో ఏఐ సిటీ, క్వాంటమ్ హబ్, 1 బయోల్యాబ్ వంటి ప్రాజెక్టులను అమలు చేస్తున్నట్లు తెలిపారు.160 సంవత్సరాల చరిత్ర కలిగిన BASF ప్రపంచవ్యాప్తంగా 200కి పైగా దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తూ 1,08,000 మంది ఉద్యోగులతో పనిచేస్తోందని, ఈ సంస్థ హైదరాబాద్‌ను ఎంపిక చేయడం రాష్ట్రానికి గౌరవకరమని మంత్రి పేర్కొన్నారు. ఎన్విడియా, మైక్రోసాఫ్ట్, గూగుల్, వాన్‌గార్డ్, ఎలీ లిల్లీ, మారియట్ వంటి సంస్థలు ఇప్పటికే GCCలను ఏర్పాటు చేయడం హైదరాబాద్ ప్రాధాన్యతను పెంచిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో BASF ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ అలెగ్జాండర్ గెర్డింగ్, టోబియాస్ డ్రాట్, తెలంగాణ ఐటీ సలహాదారు సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్నతో పాటు జొన్న కొనుగోలుకు సబ్ కమిటీ ఆమోదం – రైతులకు పెద్ద ఊరట: మంత్రి తుమ్మల



సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 06, ప్రతినిధి: రాష్ట్రంలోని రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మొక్కజొన్నతో పాటు జొన్న పంటను కూడా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రాష్ట్ర కేబినెట్ సబ్ కమిటీ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు.రైతుల సంక్షేమం కోసం తీసుకున్న ఈ నిర్ణయం వారికి పెద్ద ఊరట కలిగిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ నిర్ణయానికి ముఖ్యమంత్రి సహా సబ్ కమిటీ సభ్యులకు రైతుల తరపున మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.మంత్రి మాట్లాడుతూ మొక్కజొన్న, జొన్న పంటలను ప్రైస్ సపోర్ట్ స్కీమ్ (PSS) కింద కేంద్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రాష్ట్రం పలుమార్లు కోరినప్పటికీ ఎటువంటి స్పందన రాలేదని విమర్శించారు.అయినప్పటికీ కేంద్ర సహాయం లేకపోయినా రాష్ట్ర ప్రభుత్వం స్వయంగా కొనుగోళ్లు చేపడుతోందని తెలిపారు.ఇప్పటికే యాసంగి సీజన్‌లో 278 కొనుగోలు కేంద్రాల ద్వారా సుమారు 5.50 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు చేసినట్లు మంత్రి వెల్లడించారు. గత ఖరీఫ్‌లో కూడా 3.76 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసి రూ.902.80 కోట్ల వ్యయం చేసినట్లు తెలిపారు.ప్రస్తుతం మార్కెట్లో గిట్టుబాటు ధరలు లేక జొన్న రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో మొక్కజొన్న తరహాలోనే జొన్న పంటను కూడా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని సబ్ కమిటీ నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నిర్ణయం జొన్న రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తుందని చెప్పారు.ఈ రబీ సీజన్‌లో రాష్ట్రంలో 11.21 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న, 3.68 లక్షల ఎకరాల్లో జొన్న సాగు జరిగిందని మంత్రి వివరించారు. ఈ ఏడాదిలో పంటల కొనుగోళ్ల కోసం ప్రభుత్వం సుమారు రూ.6000 కోట్ల వరకు వ్యయం చేసిందని తెలిపారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

## పంట మార్పిడిపై అసెంబ్లీలో ప్రత్యేక చర్చ – రైతు కమిషన్‌కు సీఎం రేవంత్ రెడ్డి సూచన



సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 06, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతుల సంక్షేమ కమిషన్ (రైతు కమిషన్) చైర్మన్ ఎం. కోదండరెడ్డి, కమిషన్ సభ్యులు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గారిని జూబ్లీహిల్స్ నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా పంట మార్పిడి విధానంపై రూపొందించిన సమగ్ర నివేదికను ముఖ్యమంత్రికి అందజేశారు.సమావేశంలో మంత్రి వాకిటి శ్రీహరి కూడా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ పంట మార్పిడి విధానంపై ప్రభుత్వం సమగ్రంగా చర్చ జరపాలని భావిస్తోందని తెలిపారు. దీనిపై అసెంబ్లీలో ప్రత్యేక చర్చ ఏర్పాటు చేసి అందరి అభిప్రాయాలు సేకరిస్తామని వెల్లడించారు. పంట మార్పిడిపై మరింత లోతుగా అధ్యయనం చేసి నిర్మాణాత్మక సూచనలతో ముందుకు రావాలని రైతు కమిషన్‌ను సీఎం సూచించారు.

## తెల్లబల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన బుర్రా వెంకటేశ్వర్లుకు ఘన సన్మానం



సందేశం టైమ్స్, వాయిలసింగవరం, మే 06, ప్రతినిధి: కోర్టు ఆదేశాల మేరకు జిల్లా సహకార అధికారి ఉత్తర్వులతో తెల్లబల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా సోమవారం బాధ్యతలు స్వీకరించిన బుర్రా వెంకటేశ్వర్లు గారిని వాయిలసింగవరం గ్రామంలో ఘనంగా సన్మానించారు. గ్రామ సర్పంచ్ నందిగామ శ్రీనివాసులు గారు శాలువాతో సత్కరించగా, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చైర్మన్ బుర్రా వెంకటేశ్వర్లు గారి నాయకత్వంలో పాలకవర్గం సహకారంతో సంఘం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం చైర్మన్ బుర్రా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పీఏసీఎస్ పాలకవర్గం పదవీకాలాన్ని పొడిగించినందుకు హర్షం వ్యక్తం చేస్తూ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాడ ఉత్తమ్ కుమార్ రెడ్డి గారికి, కోదాడ నియోజకవర్గ శాసనసభ్యురాలు ఉత్తమ్ పద్మావతి రెడ్డి గారికి, అనంతగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముసుకు శ్రీనివాసరెడ్డి గారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు కొల్లు సుబ్బారావు, దాములూరి మురళి, గుండ్లపల్లి వెంకన్న, గ్రామ శాఖ అధ్యక్షుడు కంటువేణు, బుర్రా రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

## నర్సాపూర్‌లో బాలల సంరక్షణ కేంద్రాల పనితీరు మెరుగుపర్చాలని కమిషన్ ఛైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి ఆదేశం



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, మే 06, ప్రతినిధి: నర్సాపూర్ పట్టణంలో బాలల సంరక్షణ కేంద్రాల పనితీరు మరింత మెరుగుపడే దిశగా చర్యలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి స్పష్టం చేశారు. ఆమె ఆధ్వర్యంలో కమిషన్ సభ్యులు కంచర్ల వందన గౌడ్, మర్రిపల్లి చందన, ఆపర్ణ, బి. వచన్ కుమార్ తదితరులు జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా నర్సాపూర్ పర్యటనకు విచ్చేసిన ఛైర్‌పర్సన్‌కు మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ స్వాగతం పలికారు. ముందుగా వికాసం వికలాంగుల పునరావాస కేంద్రాన్ని సందర్శించి బాలబాలికల సంరక్షణ కోసం అధికారులు తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. శారీరక వైకల్యం కలిగిన చిన్నారిని చూసి స్పందించిన ఆమె, ఆపరేషన్ ద్వారా వైకల్యాన్ని సరిచేసి పౌష్టికాహారం అందించి విద్యాబుద్ధులు నేర్పించి భావి పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. అనంతరం భవిత కేంద్రాన్ని సందర్శించి చిన్నారులతో ముచ్చటిస్తూ అక్కడ అందిస్తున్న శిక్షణ, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను అభినందించారు. శివంపేట బేతని సంరక్షణ ఆశ్రమాన్ని కూడా పరిశీలించి బాలల సంరక్షణపై అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బాలల హక్కుల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తోందని, కమిషన్ సభ్యులు జిల్లాల్లో పర్యటిస్తూ బాలల హక్కుల ఉల్లంఘనలు, పౌష్టికాహార లోపం వంటి అంశాలపై పర్యవేక్షణ కొనసాగిస్తారని తెలిపారు. పిల్లలకు మెరుగైన విద్య, ఆరోగ్యం, సురక్షిత వాతావరణం కల్పించడంలో కమిషన్ కట్టుబడి ఉందని, ప్రతి ఆరు నెలలకు లేదా ఏడాదికి ఒకసారి సంరక్షణ కేంద్రాల పనితీరును సమీక్షిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా, శిశు సంక్షేమ అధికారి హేమ భార్గవి, రామాయంపేట సీడీపీఓ స్వరూప, డీసీపీఓ నాగరాజు, జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతులను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం – ఆయిల్ ఫామ్ సాగుతో అధిక లాభాలు





సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, మే 06, ప్రతినిధి: రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపడుతూ నూతన సాంకేతిక పద్ధతులను అవలంబించి తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం వచ్చే పంటలను పండించాలని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు సూచించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మెదక్ జిల్లా కేంద్రంలోని మాయ గార్డెన్‌లో ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్ సింగ్ అధ్యక్షతన నిర్వహించిన ఉద్యానవన పంటల సాగు, ఆయిల్ ఫామ్ విస్తీర్ణం పెంపు, ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన సదస్సుకు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతి రాజు, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ తదితరులతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు ఆర్గానిక్ పద్ధతులు, ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టి భూములను సంరక్షిస్తూ అధిక దిగుబడులు సాధించాలని, సమతుల్య ఎరువుల వినియోగం, ఆధునిక పద్ధతుల ద్వారా వ్యవసాయాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ రైతులు భూసార పరీక్షలు చేయించుకుని పంటల మార్పిడి పాటించాలని, పండ్లు, కూరగాయలు, పూలతో పాటు ఆయిల్ ఫామ్ సాగు ద్వారా అధిక లాభాలు పొందవచ్చని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతి రాజు మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ సాగును రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టి అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని అన్నారు. వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ మాట్లాడుతూ రైతే దేశానికి వెన్నుముక అని, రైతుల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించగా జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్ సింగ్, కౌన్సిలర్లు, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఆశా వర్కర్లకు బకాయి పారితోషికాలు వెంటనే చెల్లించాలి సీఐటీయూ డిమాండ్



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, మే 06, ప్రతినిధి: ఆశా వర్కర్లకు మార్చి, ఏప్రిల్ రెండు నెలల పారితోషికాలను వెంటనే చెల్లించాలని, ప్రతి నెల ఒకటవ తేదీన జీతాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సంతోష్ డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ రెండు నెలలుగా పారితోషికాలు రాక ఆశా వర్కర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఎండాకాలంలో పెళ్లిళ్లు, ఇతర కార్యక్రమాల కారణంగా అప్పులు చేయాల్సి వస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆశాల సమస్యలను అర్థం చేసుకుని తక్షణమే బకాయిలు చెల్లించడంతో పాటు రూ.18,000 ఫిక్స్డ్ వేతనం అమలు చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత హామీలు ఇచ్చినా ఇప్పటికీ అమలు కాలేదని, 50 లక్షల బీమా, 50 వేల మృతి ఖర్చులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వంటి హామీలు కూడా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. పీఆర్సీ ఎరియర్స్, లెప్రసీ, పల్స్ పోలియో, ఎన్నికల డ్యూటీ చెల్లింపులు సంవత్సరాలుగా బకాయిగా ఉన్నాయని, వీటన్నింటినీ పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు చి. సావిత్రి, లక్ష్మి, అనసూయ, శోభా, సావిత్రి, స్వప్న, మంజుల, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి వినియోగదారుల గుర్తింపుకు నూతన టెస్ట్ కిట్లు – అనంతపురం పోలీసుల కీలక చర్య



సందేశం టైమ్స్, అనంతపురం, మే 06, ప్రతినిధి: అనంతపురం జిల్లాలో గంజాయి వినియోగాన్ని అరికట్టేందుకు డ్రంక్ అండ్ డ్రైవ్ తరహాలో ప్రత్యేక మెడికల్ టెస్ట్ కిట్లను ప్రవేశపెట్టినట్లు జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఐపీఎస్ తెలిపారు. ఇప్పటికే వెయ్యి టెస్ట్ కిట్లు అందుబాటులో ఉండగా, మరో 10 వేల కిట్లకు ఆర్డర్ ఇచ్చినట్లు వెల్లడించారు. గంజాయి సేవించే అనుమానితులను ఈ కిట్ల ద్వారా గుర్తించి, పాజిటివ్‌గా వచ్చిన వారి నుంచి సరఫరా మార్గాలపై సమాచారం సేకరించడంతో పాటు కౌన్సెలింగ్, పునరావాస చర్యలు చేపడతామని చెప్పారు. గంజాయి రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటూ, పదేపదే నేరాలకు పాల్పడుతున్న వారిపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తున్నామని స్పష్టం చేశారు. అనుమానాస్పద వ్యక్తులపై, విద్యాసంస్థల్లో గంజాయి వినియోగంపై సమాచారం ఆధారంగా టెస్టులు నిర్వహిస్తామని హెచ్చరించిన ఎస్పీ, ప్రజలు పోలీస్ శాఖకు సహకరించి గంజాయి రహిత జిల్లాను సాధించడంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమాచారం కోసం 1972 మరియు 112 టోల్ ఫ్రీ నంబర్లకు వివరాలు అందించాలని, సమాచారం గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ రవిబాబు, ఇన్స్పెక్టర్ జైపాల్ రెడ్డి, ఎస్సై హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## బేతని సంరక్షణ కేంద్రంలో అలసత్వం సహించం కమిషన్ ఛైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి హెచ్చరిక





సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, మే 06, ప్రతినిధి: బేతని మానసిక వికలాంగుల పిల్లల సంరక్షణలో అలసత్వం వహిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి హెచ్చరించారు. నర్సాపూర్ పర్యటనలో భాగంగా బేతని మానసిక వికలాంగుల సంరక్షణ కేంద్రాన్ని కమిషన్ సభ్యులు కంచర్ల వందన గౌడ్, మర్రిపల్లి చందన, ఆపర్ణ, బి. వచన్ కుమార్ తదితరులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేవలం వసతి, భోజనం కల్పించడం మాత్రమే కాకుండా మానసిక, శారీరక అభివృద్ధికి అవసరమైన చికిత్సలు, శిక్షణలు అందించాలని సూచించారు. సంరక్షణ కేంద్రం పనితీరును సంక్షేమ శాఖ అధికారులు తరచూ పర్యవేక్షించి మెరుగుపరచాలని ఆదేశించారు. అనంతరం మానసిక వికలాంగ పిల్లలకు అరటిపండ్లు పంపిణీ చేశారు. తరువాత టిక్యా తాండ అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి పిల్లల విద్యాసామర్థ్యాలను పరిశీలిస్తూ జిల్లాలోని అంగన్వాడి కేంద్రాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. ఉసిరికపల్లి ప్రాంతంలోని ఇటుక బట్టిని పరిశీలించి బాల కార్మికులు పనిచేస్తున్నారా అనే విషయాన్ని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి, సీడీపీఓ స్వరూప, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## కళ్యాణ లక్ష్మి పేదింటి ఆడబిడ్డలకు వరం ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు

సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, మే 06, ప్రతినిధి: రామాయంపేట మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మెదక్ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని మొత్తం 96 లబ్ధిదారులకు రూ.96,11,136 విలువైన చెక్కులను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కళ్యాణ లక్ష్మి పథకం పేదింటి ఆడబిడ్డలకు ఒక వరంగా నిలుస్తోందని, పేద కుటుంబాలపై పెళ్లి భారం తగ్గించడమే ఈ పథకం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా పేదల జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు కట్టుబడి ఉందని తెలిపారు.

## దివ్యాంగుడు మన్నే పోచయ్యకు ఉచిత స్కూటీ పంపిణీ



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, మే 06, ప్రతినిధి: ప్రజా ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం రాంసాన్ పల్లి గ్రామానికి చెందిన దివ్యాంగుడు మన్నే పోచయ్యకు ఉచిత స్కూటీ అందజేశారు. జిల్లా శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా అధికారి లలిత కుమారి సమక్షంలో తెలంగాణ రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహ చేతుల మీదుగా స్కూటీని అందించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జోగిపేట గ్రామానికి చెందిన సత్యం ఆర్ట్స్, రాంసాన్ పల్లి గ్రామ సర్పంచ్ పండుగ హనుమంతు, మన్నే సోమేశ్వర్, మన్నే వినయ్, మన్నే రక్షిత తదితరులు పాల్గొన్నారు.



## పారదర్శకతతో సంక్షేమ పథకాలు అమలు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

సందేశం టైమ్స్, పటాన్చెరు, మే 06, ప్రతినిధి: పారదర్శకతతో సంక్షేమ పథకాలను అమలు చేస్తూ అభివృద్ధి, సంక్షేమానికే తొలి ప్రాధాన్యత ఇస్తున్నామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం పటాన్చెరువులోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో రామచంద్రపురం, పటాన్చెరు, అమీన్పూర్ రెవెన్యూ మండలాల పరిధిలోని 226 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం పేద, బడుగు, బలహీన వర్గాల కుటుంబాలకు ఆడపిల్ల పెళ్లి భారం కాకూడదనే ఉద్దేశంతో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి విప్లవాత్మక పథకాలను ప్రవేశపెట్టినట్లు గుర్తుచేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తూ ప్రజల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని, అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## దివ్యాంగులకు ఉచిత స్కూటీలు, అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్ల పంపిణీ

సందేశం టైమ్స్, అందోల్ నియోజకవర్గం, మే 06, ప్రతినిధి: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అన్ని వర్గాల ప్రజల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జోగిపేట ఆందోల్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరామ గార్డెన్‌లో జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అంగన్వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, రాబోయే రోజుల్లో అన్ని అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంగన్వాడీ టీచర్లు, సూపర్వైజర్లు, ఆయాలు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని, ఎక్కడైనా నిర్లక్ష్యం కనబడితే ఉపేక్షించబోమని హెచ్చరించారు. అలాగే ఖాళీ పోస్టులను భర్తీ చేస్తామని తెలిపారు. అనంతరం కార్యక్రమంలో మంత్రి 10 మంది దివ్యాంగులకు ఉచిత స్కూటీలు, 286 మంది అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పీఆర్డీ ఇండియా వికలాంగుల వర్కింగ్ ప్రెసిడెంట్ మన్నె పోచయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, అదనపు కలెక్టర్ పాండు, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి లలిత కుమారి, సిడిపిఓలు, అంగన్వాడీ సూపర్వైజర్లు, టీచర్లు, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్సీ భూపాల్ రెడ్డి జన్మదిన వేడుకలో పాల్గొన్న మెట్టు కుమార్ యాదవ్



సందేశం టైమ్స్, పటాన్చెరు, మే 06, ప్రతినిధి: మాజీ శాసనమండలి సభ్యులు వెన్నవరం భూపాల్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా పటాన్చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పటాన్చెరు బీఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ వెన్నవరం ఆదర్శ్ రెడ్డి, పలువురు నాయకులు కలిసి జన్మదిన వేడుకలో పాల్గొని శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

## బర్దిపూర్ ఆశ్రమంలో విషాదం – అనసూయ మాతాజీ బ్రహ్మలీనము



సందేశం టైమ్స్, ఝరాసంగం, మే 06, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం బర్దిపూర్ గ్రామంలోని ఆశ్రమంలో శ్రీ శ్రీ శ్రీ అవధూత గిరి మహారాజ్ గారి అమ్మగారు శ్రీశ్రీ అనసూయ మాతాజీ ఈరోజు తెల్లవారుజామున 4 గంటల సమయంలో తుది శ్వాస విడిచారు. ఈ విషాద వార్తతో ఆశ్రమంలో శోకసంద్రం నెలకొనగా, తెలంగాణ రాష్ట్రం నలుమూలల నుంచి పీఠాధిపతులు, భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా మల్లన్న గట్టు అప్పవారు, నాగదేవత ఉపాసకురాలు జయమ్మ మాతాజీ, తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ తదితర ప్రముఖులు హాజరై నివాళులర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మాతాజీకి శ్రద్ధాంజలి ఘటించారు.



## జోగిపేటలో బీజేపీ శ్రేణుల విజయాభేరి సంబరాలు

సందేశం టైమ్స్, అందోల్ మండలం, మే 06, ప్రతినిధి: జోగిపేట పట్టణంలో బీజేపీ శ్రేణులు భారీ ఎత్తున విజయాభేరి ఆనంద వేడుకలు నిర్వహించారు. అస్సాం, పుదుచ్చేరి, వెస్ట్ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాల్లో బీజేపీ సాధించిన విజయాల సందర్భంగా జోగిపేట క్లాక్ టవర్ వద్ద పటాకులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి జోగిపేట టౌన్ అధ్యక్షులు పావని, కో-కన్వీనర్ సుమన్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు శివశంకర్, జోగిపేట ప్రధాన కార్యదర్శి పాపయ్య, సీనియర్ నాయకులు సుజిత్, ఆంజనేయులు, జగన్నాథం, కట్ట రవి, ఖలీల్, కిసాన్ మోర్చా నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడల రాములు, రమేష్, శ్రీనివాస్, హరీష్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల్లో బీజేపీ విజయపథంలో ముందుకు సాగుతోందని, త్వరలో తెలంగాణలో కూడా బీజేపీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని పార్టీకి మద్దతు తెలిపారు.

## ఇస్నాపూర్ మున్సిపాలిటీలో ప్రజా సమస్యలపై చైర్‌పర్సన్ సమగ్ర పరిశీలన



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 06, ప్రతినిధి: ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 14వ, 15వ వార్డుల్లో ఉన్న ప్రజా సమస్యలను మున్సిపల్ చైర్‌పర్సన్ మోటే సుమలత శ్రీకాంత్ సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల కౌన్సిలర్లతో కలిసి ప్రజలతో ప్రత్యక్షంగా చర్చించి డ్రైనేజీ, తాగునీరు, రోడ్ల పరిస్థితి వంటి సమస్యలపై వివరంగా ఆరా తీశారు. సమస్యలను ఆలస్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశిస్తూ, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను దిశానిర్దేశం చేశారు. ఈ పరిశీలన కార్యక్రమంలో పాశమైలారం మాజీ సర్పంచ్ మోటే కృష్ణ యాదవ్, ఇస్నాపూర్ మున్సిపల్ అధికారులు, వార్డ్ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని చైర్‌పర్సన్ హామీ ఇచ్చారు.

## బోధి స్కూల్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం ప్రజలకు చల్లని తాగునీటి సేవలు




సందేశం టైమ్స్, నారాయణఖేడ్, మే 06, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పట్టణ కేంద్రంలో వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని బోధి స్కూల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే ఇలాంటి సేవా కార్యక్రమాలు అభినందనీయమని, ఇతరులకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ప్రజలకు చల్లని తాగునీరు అందించాలనే లక్ష్యంతో స్కూల్ యాజమాన్యం చేపట్టిన ఈ కార్యక్రమంలో యాజమాన్యం, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు, స్థానికులు పాల్గొని విజయవంతం చేశారు. వేసవిలో ఈ చలివేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

## పిల్లలను కాపాడే క్రమంలో తల్లి మృతి – బోర్గి తండాలో విషాదం




సందేశం టైమ్స్, కంగ్టి, మే 06, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలం బోర్గి తండాలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. బావిలో పడిన ఇద్దరు పిల్లలను రక్షించేందుకు దిగిన తల్లి సావిత్రిబాయి (30) కూడా ప్రాణాలు కోల్పోవడంతో గ్రామంలో విషాదం నెలకొంది. హైదరాబాద్‌లో నివసిస్తున్న సావిత్రిబాయి–పరశురాం దంపతులు కుటుంబంతో కలిసి బంధువుల పెళ్లికి గ్రామానికి వచ్చిన సమయంలో ఈ దుర్ఘటన జరిగింది. పిల్లలను కాపాడే ప్రయత్నంలో తల్లి కూడా బావిలో మునిగి మృతి చెందడంతో స్థానికులు కన్నీరు మున్నీరయ్యారు. ఘటనపై కంగ్టి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

## నారాయణఖేడ్‌లో అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభం మంత్రి దామోదర్ రాజనరసింహ పర్యటన



సందేశం టైమ్స్, నారాయణఖేడ్, మే 06, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించేందుకు తెలంగాణ రాష్ట్ర వైద్యారోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ ఈరోజు నియోజకవర్గానికి విచ్చేశారు. ఈ సందర్భంగా జహీరాబాద్ పార్లమెంట్ సభ్యుడు సురేష్ కుమార్ శేట్కర్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పాల్గొన్నారు. మంత్రి మున్సిపల్ పరిధిలో నూతనంగా నిర్మించిన 'బాల సాధనం' భవనాన్ని ప్రారంభించడంతో పాటు దివ్యాంగుల సంక్షేమం కోసం మంజూరు చేసిన త్రిచక్ర మోటార్ స్కూటీలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అలాగే నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మీడియా ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## అనసూయ మాత అంత్యక్రియల్లో ఎమ్మెల్యే సంజీవరెడ్డి, గాలమ్మ పాల్గొని నివాళులు

సందేశం టైమ్స్, నారాయణఖేడ్, మే 06, ప్రతినిధి: జహీరాబాద్ నియోజకవర్గంలోని బర్దీపూర్ ఆశ్రమ వ్యవస్థాపకురాలు, ఆధ్యాత్మిక మూర్తి అనసూయ మాత (97) పరమపదించడంతో నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మాత తుదిశ్వాస విడవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. అనంతరం బర్దీపూర్ ఆశ్రమంలో నిర్వహించిన అంత్యక్రియల్లో ఎమ్మెల్యే సంజీవరెడ్డి తన తల్లి శ్రీమతి పట్లోళ్ల గాలమ్మతో కలిసి పాల్గొని మాత భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కార్యక్రమంలో బిచ్కుంద పీఠాధిపతి సోమలింగ శివాచార్య మహారాజ్, స్థానిక నాయకులు, ఆశ్రమ నిర్వాహకులు, భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని మాతకు ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు.

## స్వీయ గణనకు ఇంకా 5 రోజులు మాత్రమే కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పిలుపు



సందేశం టైమ్స్, సూర్యాపేట, మే 06, ప్రతినిధి: స్వీయ గణనకు ఇంకా కేవలం 5 రోజులు మాత్రమే గడువు ఉన్నందున జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, యువత, మహిళా సంఘాలు, ఐటీ నిపుణులు సహా అన్ని వర్గాల ప్రజలు తప్పనిసరిగా పాల్గొని తమ వివరాలను నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కోరారు. మే 10 వరకు స్వీయ గణనకు అవకాశం ఉన్నందున ఇప్పటివరకు నమోదు చేసుకోని వారు వెంటనే నమోదు చేసుకోవాలని సూచించారు. జనగణనలో తొలి దశగా నిర్వహించే గృహ లెక్కింపు, గృహ పరిస్థితుల లెక్కింపులో భాగంగా ప్రజలు తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకునే సౌకర్యం అందుబాటులో ఉందని తెలిపారు. ప్రజలు తమ ఇంటి, కుటుంబ వివరాలను ప్రభుత్వ అధికారిక వెబ్ పోర్టల్ ద్వారా మొబైల్ ఫోన్, కంప్యూటర్ లేదా ఇంటర్నెట్ ఉన్న ఏ పరికరం ద్వారా అయినా సులభంగా నమోదు చేసుకోవచ్చని వెల్లడించారు.

## శ్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో జాతీయ కవి సమ్మేళనం ఎం.ఎండి. రఫీకి ఘన సత్కారం



సందేశం టైమ్స్, కొలిమిగుండ్ల, మే 06, ప్రతినిధి: శ్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా కొలిమిగుండ్ల గ్రామంలోని శ్రీ సాయి సదన్ ఆడిటోరియంలో జాతీయ కవి సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. మైన్స్ అండ్ జియాలజీ స్టేట్ డైరెక్టర్ డాక్టర్ వి.డి. రాజగోపాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖులు, కవులు, రచయితలు పాల్గొన్నారు. సమాజంలో కవులు, రచయితలు మార్పుకు దారితీసే విధంగా సాహిత్య సృష్టి చేయాలని వక్తలు సూచించారు. ముఖ్య అతిథిగా హాజరైన కళారత్న, నవ్యాంధ్ర రచయితల సంఘం అధ్యక్షుడు బిక్కి కృష్ణ మాట్లాడుతూ యువతను ప్రోత్సహించేలా కవిత్వం రచించాలని, సాహిత్యాన్ని పుస్తకరూపంలో తీసుకురావాలని అన్నారు. విమల సాయి సమితి సంపాదకులు డాక్టర్ విద్యాధర్, కవయిత్రి రత్నలక్ష్మి తదితరులు కూడా సమాజంలో సాహిత్య ప్రాధాన్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా గణిత శాస్త్ర అధ్యాపకుడు, కవి ఎం.ఎండి. రఫీ "జలము–వేసవికాలం" అనే కవితను వాచించి శ్రోతలను ఆకట్టుకున్నారు. అనంతరం ఆయనను శాలువా, మెమెంటో, ప్రశంసాపత్రంతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కవులు, రచయితలు, సాహితీవేత్తలు, అధ్యాపకులు, వైద్యులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## సాగు విధానాల్లో విప్లవాత్మక మార్పులు అవసరం కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సందేశం టైమ్స్, సూర్యాపేట, మే 06, ప్రతినిధి: జిల్లాలో వ్యవసాయ, ఉద్యానవన శాఖల సమన్వయంతో సాగు విధానాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలని, ముఖ్యంగా రైతులకు అధిక ఆదాయం అందించే పంటలపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖల ఆధ్వర్యంలో పబ్లిక్ క్లబ్ ఆడిటోరియంలో నిర్వహించిన రైతు వారం కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయం సాంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా ఆధునిక పద్ధతులతో లాభదాయకంగా మారాలని, అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. మార్కెట్‌లో ఆయిల్ పామ్‌కు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని సాగు విస్తీర్ణాన్ని పెంచాలని, ఆసక్తి ఉన్న రైతులను గుర్తించి ఫీల్డ్ విజిట్‌ల ద్వారా అవగాహన కల్పించాలని ఆదేశించారు. నీటి వనరులు పుష్కలంగా ఉన్న నేపథ్యంలో కూరగాయల సాగును ప్రోత్సహించాలని, యంత్రీకరణ, నానో యూరియా వినియోగంతో ఖర్చు తగ్గించి దిగుబడులు పెంచాలని తెలిపారు. వరి ఒక్కటే కాకుండా మార్కెట్ డిమాండ్ ఉన్న పంటల వైపు రైతులను ప్రోత్సహించాలని పేర్కొన్నారు. వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగు రైతులకు దీర్ఘకాలిక ఆదాయం అందిస్తుందని, ప్రభుత్వం గిట్టుబాటు ధరలు, మార్కెటింగ్ సదుపాయాలు కల్పిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా హార్టికల్చర్ అధికారి నాగయ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్ రెడ్డి, మార్కెట్ అధికారి నాగేశ్వర శర్మ, కెవికె శాస్త్రవేత్త నరేష్, తహసీల్దార్ కృష్ణయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## పిపిసి కేంద్రాల్లో నిల్వ ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలి – కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర

సందేశం టైమ్స్, సూర్యాపేట, మే 06, ప్రతినిధి: పిపిసి కేంద్రాల్లో నిల్వ ఉన్న వరి ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర సివిల్ సప్లై కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర సూచించారు. మంగళవారం వరి ధాన్యం కొనుగోలు కార్యక్రమాల పురోగతిని సమీక్షించేందుకు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్‌తో కలిసి పిల్లలమర్రి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులు, పిపిసి సిబ్బందితో మాట్లాడారు. ఈ సందర్భంగా కొనుగోలు ప్రక్రియ, రైతులకు అందుతున్న సౌకర్యాలు, మౌలిక వసతులు, ధాన్యం నిల్వ, నిర్వహణపై సమగ్రంగా పరిశీలించి తగు సూచనలు చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం సకాలంలో తరలింపునకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కే నరసింహ, అదనపు డైరెక్టర్ రోహిత్ సింగ్, జనరల్ మేనేజర్ నాగేశ్వరరావు, డిప్యూటీ కమిషనర్ కొండలరావు, డీఎస్‌ఓ మోహన్ బాబు, డీఎం శ్రీధర్ రెడ్డి, డీసీఓ ప్రవీణ్, డీఎంఓ నాగేశ్వర శర్మ, తహసీల్దార్ కృష్ణయ్య, రైతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతుల ధాన్యం చెల్లింపులు 48 గంటల్లో జమ చేయాలి – కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర




సందేశం టైమ్స్, సూర్యాపేట, మే 06, ప్రతినిధి: రైతులు విక్రయించిన ధాన్యానికి సంబంధించిన చెల్లింపులు 48 గంటలలోపు వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఆహార పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్‌తో కలిసి జిల్లా స్థాయి అధికారులతో వరి ధాన్యం కొనుగోలు కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పిపిసి కేంద్రాల నిర్వహణ, ధాన్యం నిల్వలు, రవాణా, మిల్లింగ్ ప్రక్రియపై సమగ్రంగా సమీక్షించారు. అకాల వర్షాల నేపథ్యంలో పిపిసి కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని, లారీల కొరత లేకుండా అవసరమైతే అదనపు వాహనాలను ఏర్పాటు చేయాలని సూచించారు. పిపిసి కేంద్రాల నుంచి ధాన్యం తరలింపు, ట్యాగింగ్, అప్‌డేట్లను రియల్ టైమ్‌లో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కొనుగోలు ప్రక్రియ పురోగతిని వివరించగా, జిల్లా సివిల్ సప్లై అధికారి మోహన్ బాబు, జిల్లా మేనేజర్ శ్రీధర్ రెడ్డి తదితరులు ధాన్యం కొనుగోలు, నిల్వ, రవాణా, మిల్లింగ్ ఏర్పాట్లపై వివరించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ కే నరసింహ, అదనపు డైరెక్టర్ రోహిత్ సింగ్, జనరల్ మేనేజర్ నాగేశ్వరరావు, డిప్యూటీ కమిషనర్ కొండలరావు, డీసీఓ ప్రవీణ్, డీఎంఓ నాగేశ్వర శర్మ, తహసీల్దార్ కృష్ణయ్య, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times,(పబ్లికేషన్: అమృత వెంకట్ మీడియా పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్.) ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.